క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక

లింగాలఘణపురం : మండలంలోని నెల్లుట్ల శివారు శ్రీనివాసనగర్ వెల్ఫేర్ సొసైటీ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెట్టిపల్లి నరేందర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా గంగరాజు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా పాశం శ్రీనివాస్, కోశాధికారిగా వెంకటశేషగిరి, ఉపాధ్యక్షురాలిగా హేమలత, సహాయ కార్యదర్శిగా యూసుఫ్, సభ్యులు నరేందర్, నరేశ్, పుష్పలత, మంగ, నవీన్ ఎన్నికయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పెద్దవంగర: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన జలగం యాకయ్య (45) వ్యక్తిగత పనుల నిమిత్తం ఇంటి నుంచి తన ద్విచక్ర వాహనంపై తొర్రూరుకు బయలుదేరాడు. తిరుమలగిరి నుంచి తొర్రూరు వైపు వెళ్తున్న లారీని వెనుక భాగంలో పెద్దవంగర ఎక్స్‌రోడ్డు వద్ద ద్విచక్రవాహనంపై వెళ్తున్న యాకయ్య బైక్ ఢీకొట్టింది. దీంతో చికిత్స నిమిత్తం వరంగల్ ఆస్పత్రికి తరలించారు.

‘కేంద్ర ప్రభుత్వంపై పోరాటం తప్పదు’


మాట్లాడుతున్న సాదుల శ్రీనివాస్

తొర్రూరు రూరల్: దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్న కేంద్ర ప్రభుత్వంపై పోరాటం తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని గుర్తూరు గ్రామంలో సీపీఎం పార్టీ మండల 5వ మహాసభను నిర్వహించారు. ముందుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గ్రామంలో డప్పుచప్పుళ్లతో ఆటపాటలతో ఊరేగింపు చేసి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన మహాసభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీనివాస్ మాట్లాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ధనవంతులు, పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకొని పర్సంటేజీలు తీసుకుంటూ ప్రజాపాలన పేరుతో ప్రభుత్వాన్ని కొనసాగిస్తుందని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు అశోక్, మోహన్, యాకూబ్, మమత, యాకయ్య, సాంబయ్య, సాయిమల్లు తదితరులు పాల్గొన్నారు.

ఒకే ఈతలో మూడు పిల్లలకు జన్మనిచ్చిన గొర్రె



తొర్రూరు రూరల్: మండలంలోని ఫత్తేపురం గ్రామంలో గొర్రె ఒకే ఈతలో మూడు పిల్లలకు జన్మనిచ్చిన అరుదైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఇట్టె మధుసూదన్‌రెడ్డి అనే రైతుకు చెందిన గొర్రె మూడు పిల్లలకు జన్మనిచ్చింది.

డిసెంబర్‌లో రైల్వే ఎన్నికలు

కాజీపేట రూరల్ : డిసెంబర్ 4, 5వ తేదీల్లో రైల్వేలో వన్ యూనియన్..వన్ ఇండస్ట్రీస్ ఎన్నికలు జరగనున్నాయని, ఈ ఎన్నికలో కార్మికులు పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్‌షెడ్ బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కే.జానీ, పి.వేదప్రకాష్ సూచించారు. ఈమేరకు కాజీపేట డీజిల్ లోకోషెడ్ కాకతీయ కళావేదికపై ఎన్నికల వాల్‌పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో 8వ పే కమిషన్, 18 నెలల డీఏ, ఎరియర్స్, పాత బకాయిలు చెల్లించాలని కోరారు. రైల్వేలో ప్రైవేటీకరణపై పోరాటం చేయాలని తెలిపారు. కార్మికులు మజ్దూర్ యూనియన్ జెండా గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు జి.రాజేశ్వర్‌రావు, యాదగిరి, నరేష్‌యాదవ్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడం సంస్థ లక్ష్యం

న్యూశాయంపేట: పేదలకు సేవ చేయడమే లక్ష్యంగా తమ సంస్థ పనిచేస్తోందని ముస్లిం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్‌కరీం తెలిపారు. వరంగల్ నగరంలోని జమతుల్ సుఫా, అరబ్బియా సిరాజుల్ ఉలూం, మదీనతుల్ ఉలూం, బాబులుల్ ఉలూం, జమైతుల్ సుఫియాన్ మదర్సాల్లో సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రెస్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు గ్రేటర్ వరంగల్ పరిధిలోని మదర్సాలో అరబ్బీ విద్యనభ్యసిస్తున్న 500 మంది విద్యార్థులకు రెండు జతల డ్రెస్‌లు అందించినట్లు వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి సిరాజ్ అహ్మద్, నాజినీన్ వాహిదీ, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

● వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ లావణ్య


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న లావణ్య

స్టేషన్‌ఘన్‌పూర్ : ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు ధర అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జూలకుంట్ల లావణ్యశిరీష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అక్కపల్లిగూడెంలో ఐకేపీ ఆధ్వర్యంలో జై హనుమాన్ మహిళా సంఘం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం వారు ప్రారంభించారు. ఈసందర్భంగా ఏపీఎం కుమారస్వామి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీపీఎం కవిత, మాజీ సర్పంచ్ కడుదుల జ్యోతినర్సిరెడ్డి, ఏఈఓ రేష్మ, సీసీ రజని, సెక్రటరీ అవినాష్, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు స్రవంతి, అనిత, ఇందిర, స్వరూప, సుశీల, నాయకులు భూపాల్‌రెడ్డి, కొమురెల్లి, రమేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

● ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం


సమావేశంలో మాట్లాడుతున్న ధర్మభిక్షం

జనగామ రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో ఇల్లు లేని పేదలను గుర్తించి వారికి ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో అడవికేశాపూర్ గ్రామ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సొంత ఇల్లులేక అద్దెకు ఉంటున్న వారు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. పేదలకు ఎలాంటి షరతులు లేకుండా ఇల్లు మంజూరు చేయాలని గ్రామంలో అధికారులు స్వయంగా పరిశీలించి నిష్పక్షపాతంగా ఇల్లు కేటాయించాలని అన్నారు. అర్హులకు అందకపోతే ప్రజలు ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సారయ్య, కరుణాకర్, బాలరాజు, చారి, శివరాజ్, సురేష్ పాల్గొన్నారు.

సర్వేకు సహకరించాలి

బచ్చన్నపేట : ఈనెల 6వ తేదీ నుంచి ప్రభుత్వం చేపట్టబోయే సమగ్ర కుటుంబ సర్వేకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి కోరారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ కులగణనతో పాటు సామాజిక, ఆర్థిక రాజకీయ అంశాలపై ప్రతీ ఇంటికి సర్వే బృందం వచ్చి వివరాలు సేకరిస్తుందని, వారికి సహకారం అందించాలని సూచించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల ప్రతీ ఒక్కరికి అందాలంటే ఈ సర్వే ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో జంగిటి విద్యానాథ్, కావ్య శ్రీరెడ్డి, నిడిగొండ శ్రీనివాస్, జంగిటి నరేష్, నల్లగోని బాలకిషన్‌గౌడ్, మసూద్, మహాత్మాచారి, తదితరులు పాల్గొన్నారు.

‘ఔట్ సోర్సింగ్’లను రెగ్యులరైజ్ చేయాలి


ఎన్నికైన జిల్లా కమిటీ సభ్యులు

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

జనగామ రూరల్ : వైద్య, ఆరోగ్య శాఖలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఎంసీహెచ్ ఆవరణలో తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ..పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాల్సి ఉండగా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షుడిగా రాపర్తి రాజు, జిల్లా అధ్యక్షుడిగా ఎం.రామ్ దయాకర్, ప్రధాన కార్యదర్శిగా రేష్మ, ఉపాధ్యక్షులుగా రఘు,అజయ్, సహాయ కార్యదర్శిగా సునీత, కోశాధికారిగా స్వామి ఎన్నికయ్యారు.

చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

జఫర్‌గఢ్ : మండలంలోని ఓబులాపూర్ గ్రామానికి చెందిన కరాటే మాస్టర్ సార్థక్ కుమార్‌కి కడియం ఫౌండేషన్ ద్వారా ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి చెక్కు అందజేశారు. సార్థక్ కుమార్ ఈ నెల 6వ తేదీన గోవాలో జరగనున్న అంతర్జాతీయ వరల్డ్‌కప్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంది. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గార్లపాటి నీరాజారెడ్డి, కాంగ్రెస్ నాయకులు మొగులుగాని కుమార్, అలుగోజు అనిల్ తదితరులు ఉన్నారు.

నేడు మహారుద్రాభిషేకం

బచ్చన్నపేట : కార్తీక మాసం సందర్భంగా నేడు (సోమవారం) మండలకేంద్రంలోని శివభక్త మార్కండేయస్వామి ఆలయంలో మహాశివుడికి రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు అర్చకులు గణపురం ఆనంద్‌స్వామి తెలిపారు.ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కార్తీక మాసంలో శివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన సోమవారం కావడంతో ఉదయం 6 గంటలకు రుద్రాభిషేకం, పూజా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు.సాంప్రదాయ దుస్తులు ధరించాలని తెలిపారు. సోమవారం రాత్రి 6 గంటలకు ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించుకోవచ్చని సూచించారు. 7 గంటల వరకు ఆలయం తెరిచి ఉంటుందన్నారు.

మహాసభను జయప్రదం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాపర్తి రాజు

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని రంగరాయగూడెంలో ఈనెల 12న నిర్వహించనున్న సీపీఎం మండల మహాసభకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు అన్నారు. మండలంలోని రంగరాయగూడెంలో ఆదివారం ఏర్పాటు చేసిన గ్రామ కమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన హాజరై, మాట్లాడారు. సీపీఎం ఆవిర్భావం నుంచి పేదలు, కార్మికులు, కర్షకుల పక్షపాతిగా పని చేస్తోందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఘన్‌పూర్ మండలంలో ప్రతీ ఎకరాకు దేవాదుల నీరు అందించాలని, రోడ్ల సమస్యను పరిష్కరించాలని, ఘన్‌పూర్ రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి మునిగెల రమేష్, నాయకులు కొడెపాక యాకయ్య, వెంకట్‌రెడ్డి, నర్సింహులు, ఇలిషన్, కొమురయ్య, రాములు, పెద్దిరెడ్డి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై ధాన్యం ఆరబోయొద్దు

● సీఐ మహేందర్ రెడ్డి

పాలకుర్తి : రైతులు పండించి తమ ధాన్యాన్ని పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల ప్రాంతాల్లోని రోడ్లపై ఆరబోయొద్దని దీంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని సీఐ మహేందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన పలు రోడ్లలో ఆరబోసిన ధాన్యాన్ని రైతులకు ఆరబోయకుండా పలు సూచనలు చేశారు. రోడ్డుపై ధాన్యం ఉంటే వాహనదారులకు ప్రమాదాలు ఏర్పడి మరణిస్తున్నారని, తీవ్ర గాయాలయ్యాయన్నారు. రైతులు సమస్యలను గుర్తించి తమ స్థలంలోనే ఆరబోసుకోవాలని అన్నారు. లేని పక్షంలో రైతులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


చిల్పూరు: బియ్యం అందజేస్తున్న నాయకులు


దేవరుప్పుల: చిన్నమడూరు బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న శ్రీకాంత్‌గౌడ్

చిల్పూరు : మండలంలోని చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన సముద్రాల ఎల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు ఇల్లందుల యాదగిరి, నాయకులు తాళ్లపల్లి బుచ్చయ్య ఆదివారం పరామర్శించారు. అనంతరం వారికి తమవంతుగా ఆర్థికసాయం అందజేశారు.

బాధిత కుటుంబాలకు అండగా బీఆర్ఎస్

దేవరుప్పుల : బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తోందని ఆ పార్టీ జిల్లా యువజన నాయకుడు బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని చిన్నమడూరు, మాదాపురం, రామరాజుపల్లి గ్రామాలకు చెందిన కాముని లలిత, పందెనబోయిన మల్లేష్, ఉప్పునూతుల ఆనంద్ ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాలను వారు పరామర్శించారు. ఇటీవల తాటిచెట్టు పైనుంచి పడి చికిత్స పొందుతున్న దేవరుప్పులకు చెందిన ఊడుగు సత్యనారాయణను ఆయన పరామర్శించారు. ఈయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్, నాయకులు కోతి ప్రవీణ్, ఎండీ ఖాసీం, జోగు సోమనర్సయ్య, అలకుంట్ల యాదగిరి, బండి నర్సింహులు, మైదం జోగేశ్వర్, మాచర్ల బాబు, కారుపోతుల యాదగిరి, ఐలయ్య, దాట్ల యాకన్న, దశరథ, ఉప్పునూతుల నాగరాజు, తోకల రాజు, వినయ్, రాజు, భారత్, మధు పాల్గొన్నారు.


దేవరుప్పుల: కడవెండిలో..

రామ్‌చరణ్ మృతికి పలువురి సంతాపం

మండలంలోని కడవెండి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పసునూరి సంపత్ కుమారుడు రామ్ చరణ్ ఆదివారం మృతి చెందాడు. కాగా రామ్‌చరణ్ మృతదేహంపై స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాల వేసి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. మాజీ ఎంపీపీ బస్వ సావిత్రి, నక్క రమేష్, దుబ్బాక కవిత రత్నాకర్‌రెడ్డి, పంతం సరోజన అచ్చయ్య, పోతిరెడ్డి బెల్లీనాలీనారెడ్డి, మజార్, పెద్ది సోమయ్య, మహేష్, రాంబాబు, సోమనర్సోజీ, మైనాల రమేష్, భాస్కర్, బాషిపాక అంజయ్య తదితరులు ఉన్నారు.

శ్వేతార్క ఆలయంలో భగిని సహపంక్తి భోజనాలు

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో అన్నపూర్ణ భవనంలో ఆదివారం భగిని హస్త భోజనం నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయిన వోలు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి అర్చకులు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు జరిపించారు. భగిని హస్త భోజనం పర్వదినాన్ని పురస్కరించుకుని మహిళలు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎల్.రవి, దుర్గం సుధీర్‌తో పాటు తదితరులు ఉన్నారు.

సమ్మేళనానికి తరలిన డీఎస్‌పీ నాయకులు



జనగామ రూరల్ : హైదరాబాద్‌లో నిర్వహించిన ధర్మసమాజ్ పార్టీ మొదటి మహాసభ సమ్మేళనానికి ఆదివారం జనగామ జిల్లా నాయకులు తరలి వెళ్లారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు చిరంజీవి, ఉపాధ్యక్షుడు సందీప్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రవి, కోశాధికారి కిష్టయ్య, అనిల్, నవీన్, బాబు, ఆకాష్, రాజేందర్, వివిధ మండలాల ప్రతినిధులు తరలి వెళ్లిన వారిలో ఉన్నారు.

పార్టీ బలోపేతానికి పాటుపడండి

● బీజేపీ కేఎస్‌సీ సభ్యుడు రాజమౌళిగౌడ్


దేవరుప్పుల:నీర్మాలలో మాట్లాడుతున్న రాజమౌళి

దేవరుప్పుల : పాలకుర్తి నియోజకవర్గంలో అత్యధిక సభ్యత్వ నమోదు చేయించి బీజేపీ బలోపేతానికి పాటుపడాలని బీజేపీ క్రమశిక్షణ కమిటీ రాష్ట్ర సభ్యుడు నాగపురి రాజమౌళి సూచించారు. ఆదివారం మండలంలోని నీర్మాలలో బీజేపీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లోకెల్లా ప్రస్తుతం పాలకుర్తి నియోజకవర్గం బీజేపీ సభ్యత్వ నమోదులో మొదటి స్థానంలో ఉండడం అభినందనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగడుతూ మోదీ సర్కార్ శాశ్వత ప్రాతిపదికన చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పనులపై అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలో అధికారం సాధించేదిశగా పోలింగ్ బూత్ స్థాయిలో సభ్యత్వ నమోదు పెంచే విధంగా కార్యకర్తలు పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు లేగ రామ్మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చాడ రమేశ్, అసెంబ్లీ కన్వీనర్ పి.శ్రీమాన్, మండల మాజీ అధ్యక్షుడు బాగాల నవీన్ రెడ్డి, నర్సింహ్మాచారి, కొత్త సత్తిరెడ్డి, ప్రవీణ్, పల్లె కుమార్, భాస్కర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

లింగాలఘణపురం : మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదును ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించగా రాష్ట్ర నాయకుడు లేగ రాంమోహన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చౌడ రమేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, ఉపాధ్యక్షుడు కేమిడి నాగరాజు, గణేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కళా పోషణలో..రవీందర్ భళా


రావణాసురుడిగా..


దుర్యోధనుడి పాత్రలో..


విశ్వామిత్రగా..

● పౌరాణిక వేషధారణ ప్రదర్శించడంలో దిట్ట

చిల్పూరు : పాత్ర ఏదైనా జీవిస్తాడు..పౌరాణిక వేషధారణలో రక్తికట్టిస్తాడు. ప్రేక్షకులను మైమరపించి ఆకట్టుకుంటాడు.. మండలంలోని కృష్ణాజీగూడెం గ్రామానికి చెందిన అక్కెనపల్లి రవీందర్ పౌరాణిక వేషధారణలో ప్రతీ ఒక్కరి నోట భళా అనిపించుకుంటున్నాడు. రవీందర్‌కి చిన్ననాటి నుంచే పౌరాణిక వేషధారణలు అంటే ఎంతో ఇష్టం. చదువుకునే రోజుల్లో రేడియోలో వచ్చే పౌరాణిక గేయాలను బట్టీపట్టి పాఠశాలల్లో నాటక ప్రదర్శన ఇచ్చేవాడు. ఇలా ప్రాచీన కళలను కాపాడుతున్న రవీందర్‌కు ఇటీవల నాటక సమాజ సమాఖ్య జనగామ జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేశారు.

ఏ వేషం వేసినా ఆకట్టుకునే కళ రవీందర్‌ది..

విశ్వామిత్ర, దుర్యోధనుడు, రావణబ్రహ్మ ఏ వేషం ధరించిన ప్రతీ ఒక్కరిని ఆకట్టుకునే కళ రవీందర్ సొంతం.గ్రామాల్లో ప్రజలు ప్రాచీన కళలను ప్రోత్సహిస్తున్నప్పటికి ఒక్కో వేషం వేయడానికి అయ్యే ఖర్చులు ఎక్కువ అవుతుండడంతో కళా ప్రదర్శనలు ఇవ్వలేక పోతున్నారు.కళ పోషణ ఖర్చుతో కూడుకుంది.

ప్రభుత్వం ప్రోత్సహించాలి



ప్రాచీన కళలు అంతరించిపోకుండా ప్రభుత్వం కళాకారులు ప్రోత్సహించాలి. ప్రస్తుత కాలంలో అలనాటి ప్రాచీన పౌరాణిక వేషధారణలు అంటే నేటి యువతకు తెలియడం లేదు. అందుకు కళాకారులను గుర్తించి ప్రతీ గ్రామంలో కళా ప్రదర్శనలు ఇప్పించే విధంగా కృషిచేయాలి.

- రవీందర్

టేకు తలుపుల బహూకరణ


హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న దాతలు

స్టేషన్‌ఘన్‌పూర్ : డివిజన్ పరిధిలోని చెరువుకట్ట సమీపంలో గల అభయాంజనేయస్వామి దేవాలయానికి స్థానికులు డాక్టర్ జైహింద్‌రాజ్-నిర్మల దంపతులు రూ.50వేలు విలువైన టేకు తలుపులను బహూకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ జైహింద్‌రాజ్ కుటుంబ సభ్యులు ఆదివారం హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక చెరువు కట్ట అభయాంజనేయస్వామి దేవాలయానికి తమమంతుగా టేకు తలుపులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పూజారి కలకోట శేషాచార్యులు, డాక్టర్ అంబటి కిషన్‌రాజు, లావణ్య, డాక్టర్ శ్రీనివాసరాజు, హేమ, డాక్టర్ హేమంతరాజు, వాసవి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

జఫర్‌గఢ్ : మండలంలోని కూనూర్ ఉన్నత పాఠశాలలో 1994–95 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో స్థిరపడి ఎన్నో ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు పాఠశాల వేదికగా అందరూ ఒకేచోట కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకున్నారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం అప్పటి గురువులను సన్మానించారు.గురువులు సుధాకర్‌రావు, దేవేందర్, ఎల్లయ్య, సంపత్‌రావుతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.